క్లుప్తంగా

పల్లపు భూముల్లో జోరుగా వరి నాట్లు



సాగరంలో వరి నాట్లకు సిద్ధంగా ఉన్న కూలీలు

మాడుగుల రూరల్:పల్లపు భూముల్లో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. తారక రామ, పెద్దేరు జలాశయ ఆయకట్టు భూముల్లో ఖరీఫ్ వరినాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. దీంతో మహిళా కూలీలకు డిమాండ్ పెరిగింది. తారకరామ, పెద్దేరు, కోనాం జలాశయం సాగు నీటిని ఇటీవల విడుదల చేశారు. దీంతో ఈ జలాశయాలు దిగువన గల పంట భూముల్లో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి.

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ



దేవరాపల్లిలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

దేవరాపల్లి: కేరళ వరద బాధితుల కోసం స్థానిక సీపీఎం నాయకులు మండల కేంద్రంలో మంగళవారం విరాళాలు సేకరించారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడి ఊళ్లకు ఊళ్లు కొట్టుకుపోయి వందలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీపీఎం మండల కార్యదర్శి బీటీ దొర నేతృత్వంలో దేవరాపల్లి మెయిన్‌రోడ్డులో గల దుకాణాలు, పలువురు వ్యాపారవేత్తలు, స్థానికుల నుంచి విరాళాలు సేకరించారు. కొప్పల వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు సహా పలువురు విరాళాలను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ విరాళాలను త్వరలో కేరళ వరద బాధితులకు అందిస్తామన్నారు.

కంటి శస్త్ర చికిత్సకు 48 మంది ఎంపిక



శస్త్ర చికిత్సకు తరలి వెళ్తున్న కంటి రోగులు

బుచ్చియ్యపేట: విశాఖ శంకర్ ఫౌండేషన్‌లో కంటి శస్త్రచికిత్సకు 48 మందిని ఎంపిక చేశారు. మండలంలోని వడ్డాది సహకార సంఘ భవనం వద్ద మంగళవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా సహకార సంఘం, శంకర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 120 మంది కంటి సమస్యలున్నవారు హాజరయ్యారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి, శస్త్ర చికిత్స అవసరమైన 48 మందిని గుర్తించారు. శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో వీరికి శస్త్రచికిత్సలు జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బర్నుల తాతయ్యబాబు, పీఏసీఎస్ కార్యదర్శి శాంతి, శంకర్ ఫౌండేషన్ మేనేజర్ అరుణ్‌కుమార్‌లు పాల్గొనగా కంటి వైద్యులు గీతాంజలి, హరిచందన రోగులకు పరీక్షలు జరిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శన



ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రదర్శిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పలరాజు

దేవరాపల్లి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎంపీడీవో కార్యాలయం నోటీస్ బోర్డులో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.అప్పలరాజు మంగళవారం ప్రదర్శించారు. ఈ మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను స్థానిక సచివాలయం-1 నోటీస్ బోర్డులో కూడా అతికించారు. ఈ నెల 13 లోపు నామినేషన్లు దాఖలు చేయాలని, 14న నామినేషన్ల పరిశీలన, 16లోగా ఉప సంహరణ, 30న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.



భయపెడుతున్న గ్రామ సింహాలు

- లేగదూడలు, నాటు కోళ్లపై దాడి
- వందల సంఖ్యలో కుక్కకాటు బాధితులు
- చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు

నాతవరం/మాడుగుల: గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువయింది. వీటి సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇటీవలి కాలంలో ఏ ఊళ్లో చూసినా కుక్కలు గుంపులుగా సంచరిస్తూ, మనుషులు, పశువులపై దాడులకు దిగుతున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులపై ఎక్కువగా ఎగబడుతున్నాయి. నాటుకోళ్లను తినేస్తున్నాయి. రెండు మాసాల వ్యవధిలోనే నాతవరం, గునుపూడి పీహెచ్‌సీల పరిధిలో కుక్కకాటుకు బాధిత కేసులు 100కు పైగా నమోదవడం వీటి తీవ్రతను బయటపెడుతున్నాయి.

మాడుగుల మండలంలో కూడా చాలా చోట్ల ఇదే పరిస్థితి. అత్యంత రద్దీగా ఉండే ఘాట్‌రోడ్ జంక్షన్లో ఊర కుక్కల సంఖ్య చాలా ఎక్కువగా పెరిగింది.



ఘాట్‌రోడ్ జంక్షన్‌లో పరుగులు తీస్తున్న ఊర కుక్కలు

గతంలో 10-20 ఉండే వీటి సంఖ్య ప్రస్తుతం 100-150 వరకు పెరిగినట్లు స్థానికులు చెప్తున్నారు. రాత్రి పూట ఒంటరిగా జంక్షన్ మీదుగా వెళ్లే వారిని వెంబడించి మరీ కరుస్తున్నాయి. ఆ పరిసర ప్రాంతాల్లోని పశువుల పాకల్లో చొరబడి లేగదూడలపై దాడులకు దిగాయి. నాటు కోళ్లను కూడా తినేస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రయితే ఘాట్‌రోడ్ జంక్షన్‌లో కుక్కలకు భయపడి అటువేపు వెళ్లేందుకే ప్రజలు, వాహనదారులు



వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

భయపడుతున్నారు. నాతవరం మండలంలోని గునుపూడి, గుమ్మడిగొండ, మర్రిపాలెం, శృంగవరం, ఎంబీ పట్నం గ్రామాల్లో పశువుల పాకల వద్ద లేగదూడలను సైతం గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. రైతులు కల్లాల వద్ద పెంచుకునే నాటు కోళ్ల కుక్కలు ఎత్తుకుపోయి తినేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో పంచాయతీ అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టేవారు. ఇటీవల కాలంలో న్యాయ స్థానం ఆదేశాల మేరకు కుక్కల జోలికి వెళ్లట్లేదని పలువురు పంచాయతీ కార్యదర్శులు చెప్తున్నారు. దీంతో కుక్కల కుటుంబ నియంత్రణ చర్యలు కూడా చేపట్టట్లేదు. ఈ నేపథ్యంలో ఎక్కడ చూసినా కుక్కల సంచారం ఎక్కువయింది. ప్రజల ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శరవేగంగా అదనపు తరగతి గదుల నిర్మాణం

కె.కోటపాడు: గొండుపాలెం హైస్కూల్లో అదనపు భవన నిర్మాణంతో తరగతి గదుల సమస్య పూర్తిగా తొలగనున్నట్లు సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి తెలిపారు. మనబడి-మన భవిష్యత్ ఫేజ్-2 నిధులతో పాఠశాలలో జరుగుతున్న మూడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంగళవారం శ్లాబ్ పనులు జరిపారు. సర్పంచ్ కనక మల్లీశ్వరి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సమగ్ర శిక్ష సైట్ ఇంజినీర్ అప్పలనాయుడు మాట్లాడుతూ పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవన నిర్మాణంతోపాటు ఇతర మౌలిక సదుపాయాలకు రూ.14 లక్షల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రొంగలి నాగేశ్వరరావు, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, పీఈటీ రోహిణి, ఉపాధ్యాయులు నారాయణరావు, రమేష్ పాల్గొన్నారు.



గొండుపాలెం హైస్కూల్లో శ్లాబ్ నిర్మాణ పనుల్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కనకమల్లీశ్వరి

సుప్రీం తీర్పుపై ఎమ్మార్పీఎస్ హర్షం

మాడుగుల రూరల్: ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడం పట్ల ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ, మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కె.జె.పురంలోని బాబూ జగ్జీవన్‌రాం యువజన సేవా సంఘం అధ్వర్యంలో మంగళవారం మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం సీనియర్ నాయకులు కండెల్లి వెంకటరావు మాట్లాడుతు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు కృష్ణమాదిగ 30 ఏళ్ల ఉద్యమాన్ని కొనియాడారు. ప్రతి యువకుడు కృష్ణమాదిగ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ చిన్నం లోవతల్లి, దాలిబాబు, ఎమ్మార్పీఎస్ సీనియర్ కార్యకర్తలు బి.జగ్గప్పారావు, చిన్నం మాలిబాబు, కొండారావు, చిన్నం శంకర్, తాడి మాలిబాబు, చిన్నం నూకరాజు, బెన్నవోలు పరదేశినాయుడు, రాము తదితరులు పాల్గొన్నారు.



కేజే పురంలో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

160 హెక్టార్లలో వరినాట్లు పూర్తి

మాకవరపాలెం: మండలంలో ఇప్పటి వరకు 160 హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ అధికారి(ఏవో) చిరంజీవి తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో వర్షాలు అనుకూలిస్తే ఖరీఫ్ సీజన్లో సాధారణ విస్తీర్ణం 1291 హెక్టార్లలో నాట్లు వేస్తారని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పి.పి.అగ్రహారం, గిడుతూరు, మల్లవరం, వజ్రగడ, మాకవరపాలెం, తామరం ప్రాంతాల్లో 160 హెక్టార్లలో రైతులు వరినాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ముమ్మరంగా దమ్ములు జరుగుతున్నాయని, మరో వారం రోజుల్లో నాట్లు పూర్తవుతాయని పేర్కొన్నారు.

'పీఏసీఎస్ సభ్య రైతులు సమాచారమివ్వండి'

కె.కోటపాడు: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘా(పీఏసీఎస్)ల్లోని సభ్య రైతులు ప్రభుత్వ ఆదేశాల మేరకు వారి సమాచారాన్ని బ్యాంక్ సిబ్బందికి అందించాలని కె.కోటపాడు, చౌడువాడ పీఏసీఎస్‌ల అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ బి.గీతావాణి మంగళవారం తెలిపారు. రెండు పీఏసీఎస్‌ల సభ్య రైతులు వారి భూమి పాస్ పుస్తకం/1-బి, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జెరాక్స్‌లతో పాటు ఫోన్ నెంబర్, రెండు పాస్ ఫొటోలను బ్యాంక్ పని చేసే సమయాల్లో సిబ్బందికి అందించాలన్నారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణలో భాగంగా రైతుల నుంచి వీటిని సేకరిస్తున్నట్లు రెండు బ్యాంక్‌ల సీఈవోలు ఆర్.చినఈశ్వరరావు, బి.సత్యనారాయణ తెలిపారు.

ఆరు మాసాల్లో జల్ జీవన్ మిషన్ పనుల పూర్తి

కె.కోటపాడు: మాడుగుల నియోకవర్గంలో జల్ జీవన్ మిషన్ నిధులతో 120 గ్రామాల్లో జరగాల్సిన పనుల్ని ఆరు మాసాల్లో పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారుల్ని ఆదేశించారు. కె.కోటపాడు సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణతో పాటు నాలుగు మండలాల జేఈలు, కాంట్రాక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్ పనులకు రూ.178 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. 120 గ్రామాల్లో రూ.70 కోట్ల నిధులతో పనులు పూర్తయ్యాయన్నారు. వచ్చే వేసవి నాటికి తాగునీటి ఇబ్బందుల్లేకుండా ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీటి సరఫరా చేయాలన్న లక్ష్యంతో అధికారులు కాంట్రాక్టర్లతో పనులు చేయించాలన్నారు. సమావేశంలో ఏఈ శ్వేత, సైట్ ఇంజినీర్ జి.లక్ష్మణరావు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



కె.కోటపాడులో అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

నాగవరం రోడ్డులో వాహన తనిఖీలు

మునగపాక : ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రికార్డులు వెంట ఉంచుకోవాలని ఏఎస్ఐ రామకృష్ణ కోరారు. మంగళవారం గాజువాక-అచ్యుతాపురం రోడ్డులోని నాగవరం వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్‌లు లేకుండా వాహనాలు నడిపినా అలాగే మద్యం తాగి వాహనాలు నడిపే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



వాహన తనిఖీలు చేస్తున్న ఏఎస్ఐ రామకృష్ణ

కోడ్ ఉల్లంఘనపై చర్యలేవీ..?

మునగపాక : ఎంఎల్‌సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉన్నా ఎక్కడా అధికారులు కోడ్ ఉల్లంఘనలను పట్టించుకోవట్లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి ఈ నెల 30న ఎంఎల్‌సీ ఎన్నికకు అవసరమయ్యే ఏర్పాట్లు ప్రభుత్వ యంత్రాంగం చేపట్టింది. అయితే కోడ్ అమలును పక్కాగా అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన నాయకులకు చెందిన ఫ్లెక్సీలను, భారీ కటౌట్లను తొలగించడం లేదని స్థానికుల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రోజూ అధికారులు రాకపోకలు సాగించే రోడ్లపైనే ఇవి ఉన్నా వీటిని తొలగించట్లేదని ఆక్షేపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని ఉల్లంఘన లేకుండా చూడాలని కోరుతున్నారు.

'ఓపెన్ స్కూల్లో విద్యార్థుల్ని చేర్పించండి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవోలు

రోలుగుంట: 2024-25 విద్యా సంవత్సరంలో సార్వత్రిక విద్యావిధానంలో పిల్లల్ని చేర్పేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు జానుప్రసాద్, జగ్గారావు సూచించారు. మండల రిసోర్స్ కేంద్రంలో మంగళవారం మండల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. చదువు మధ్యలో ఆపేసిన 15 ఏళ్లు దాటిన వారిని టెన్త్, 18 ఏళ్లు దాటిన వారిని ఇంటర్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ అవకాశాన్ని అన్ని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. దీనికి ముందు ఏపీ ఓపెన్ స్కూల్ కరపత్రాలను ఆవిష్కరించారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు తప్పవు

రోలుగుంట: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండలంలోని అన్ని గ్రామాలు, శివారు గ్రామాల్లో కూడా విధిగా నిబంధనలు అమలు చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు సంబంధిత పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయితీ కార్యదర్శులతో ఈవోపీఆర్డీ ఎస్.నూకరాజు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వచ్చే నెల 6 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. నిబంధనలు పక్కాగా అమలు చేసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. గ్రామాల్లో ఎక్కడా రాజకీయ నాయకుల కటౌట్‌లు, ప్రచార హోర్డింగులు లేకుండా పూర్తిగా తొలగించాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయించాలన్నారు. కోడ్‌ను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వర్రావు

రైతు సేవా కేంద్రాలతో సత్వర పశు వైద్యం

కె.కోటపాడు: గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా పశు వైద్యం సకాలంలో అందించేలా పశువైద్య సహాయకులు అందుబాటులో ఉండాలని స్థానిక పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. మండలంలోని పిండ్రంగి, దాలివలస రైతు సేవా కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్య సేవల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు పశుపోషణలో అవసరమైన సలహాలు, సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షేత్రస్థాయికి వెళ్లి వివరించాలని తెలిపారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 19 వరకూ వేయనున్నట్లు పేర్కొన్నారు. మూడు నెలలు దాటిన ప్రతీ పెయ్యితో సహా 37 వేల ఆవులు, గేదెలకు టీకాలు వేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ గాలి కుంటు టీకాలను పశువైద్య సహాయకులు వేయాలన్నారు. సెప్టెంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా 21వ అఖిల భారత పశుగణన జరగనున్నట్లు పేర్కొన్నారు. నాలుగు నెలల వ్యవధిలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పశువైద్య సహాయకులకు తెలిపారు. పశుగణనలో భాగంగా ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ళు, పందులు, శునకాలను నమోదు చేయాలన్నారు. ఆయన వెంట పశువైద్య సహాయకుడు కె.గోపి, సంతోష్ పాల్గొన్నారు.



పిండ్రంగి రైతు సేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ దినేష్‌కుమార్

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ మండల కార్యవర్గం ఎన్నిక

కె.కోటపాడు: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కె.కోటపాడు యూనిట్ కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ మందిరంలో మంగళవారం జరిగిన ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా ఎ.నాగేశ్వరరావు, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఎస్.కె.బాబూరావు వ్యవహరించారు. అధ్యక్షుడిగా ఎస్.అప్పలరాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా బంగారి వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.రాముునాయుడు, కార్యదర్శిగా శంకరరావు, ఉపాధ్యక్షులుగా బి.శంకరరావు, సుశీల, జాయింట్ సెక్రటరీలుగా కె.శ్రీను, నళిని, ట్రెజరర్‌గా డాక్టర్ నిర్మల ఎన్నికయ్యారు.



అభినందనలు అందుకున్న నూతన కార్యవర్గం

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ పోషణ

తల్లిపాల వారోత్సవాలు గ్రామాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం ద్వారా కలిగే ప్రయోజనాలను అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి గర్భిణులకు, బాలింతలకు వివరిస్తున్నారు. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు కేవలం తల్లి పాలను మాత్రమే ఆహారంగా ఇవ్వాలని అవగాహన పెంచుతున్నారు.

- ఊరూ వాడా ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

రోలుగుంట: మండలంలో పలు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. కంచుగుమల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులకు అంగన్‌వాడీ టీచర్ సీహెచ్ వరలక్ష్మి తల్లిపాల వినియోగం, మేలు గురించి అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. డబ్బా పాలతో బిడ్డల్లో ఆశించిన ఎదుగుదల ఉండదని, త్వరగా రోగాల బారిన పడతారని హెచ్చరించారు.

మాడుగుల రూరల్: తల్లిపాలలో అధిక పోషక విలువలు ఉంటాయని కేజే పురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లీలాప్రసాదు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కేజే పురం పీహెచ్‌సీ నుంచి ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి తల్లి బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు తాగించాలని, దీని వల్ల బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతను గ్రామాల్లో మహిళలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఎం.ఇందిర, పీహెచ్‌సీ సిబ్బంది, పాల్గొన్నారు.



కంచుగుమల్లో తల్లిపాల ప్రయోజనాలను వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి

బుచ్చియ్యపేట: తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని, తల్లికి కూడా ఎంతో ఆరోగ్యదాయకమని వడ్డాది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ తల్లి పాల విశిష్టత, అవి తీసుకోవడం వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించడం ఆరోగ్య సిబ్బంది బాధ్యత అన్నారు. ప్రకృతి అందించిన అమృతమే తల్లిపాలని గుర్తెరిగేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ అమ్మాజీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.రాజరాజేశ్వరి, ఏఎస్‌హెచ్‌డబ్ల్యూ, ఏఎన్ఎంలు, హెల్త్ సిబ్బంది, వడ్డాది సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడు: తల్లిపాల ద్వారానే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. గొట్లాం గ్రామ అంగన్‌వాడీ కార్యకర్త కె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన చిన్నారులకు అరగంట వ్యవధిలోనే తల్లిపాలను అందించాలన్నారు. బిడ్డకు తల్లిపాల ద్వారా వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందన్నారు. అనంతరం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.వెంకటలక్ష్మి, ఆర్.వీ.లక్ష్మి, మణి, లక్ష్మి పాల్గొన్నారు.




కేజే పురం పీహెచ్‌సీ వద్ద ర్యాలీలో ఆశ కార్యకర్తలు, వైద్యాధికారి లీలాప్రసాదు తదితరులు




బుచ్చెయ్యపేట: తల్లి పాల వారోత్సవాలలో పాల్గొన్న డాక్టర్ మౌనిక, వైద్య ఆరోగ్య సిబ్బంది


నాతవరం: తల్లిపాల ప్రాముఖ్యత గురించి తల్లులు కనీస అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ నాతవరం, గన్నవరం సెక్టార్ల సూపర్‌వైజర్లు ఎ.విజయలక్ష్మి, ఎ.నాగజ్యోతి తెలిపారు. మంగళవారం నాతవరం సెక్టార్ పరిధి వల్లంపేట, గన్నవరం సెక్టార్ పరిధి గన్నవరం మెట్ట వద్ద అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లో ర్యాలీలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించడం వలన వ్యాధి నిరోధిక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని విధిగా బాలింతలు, గర్భిణులు తీసుకోవడంతోపాటు, వైద్యుల సూచనలు పాటిస్తే రక్త హీనత సమస్య తలెత్తదన్నారు. మూఢనమ్మకాలు విడనాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గన్నవరం మెట్ట వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది




వల్లంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



గొట్లాంలో తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీలో సుశీల, వెంకటలక్ష్మి తదితరులు

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి



ఆటలు ఆడుతున్న విద్యార్థులు

నక్కపల్లి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదరాంభద్రపురంలో రాబోవు స్వాతంత్ర దిన వేడుకలను పురస్కరించుకుని, ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు వ్యాయమ ఉపాధ్యాయుడుషేక్ రహమాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు ప్రారంభించారు. విద్యార్థులు ఆనందోత్సాహాల నడుమ క్రీడల్లో పాల్గొన్నారు. మంగళవారం బాలికల సీనియర్స్, బాలుర సీనియర్స్‌కు కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలు ప్రారంభానికి ముందుగా వ్యాయామ ఉపాధ్యాయులు ఆయా జట్ల కెప్టెన్‌లను ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావుకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ చదువుతో పాటు మానసిక ఆరోగ్యానికి ఆటలు ముఖ్యమ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు లు జి.భావనారాయణ, ఎస్.రవికృష్ణ, ఐ.శివాజీరావు, ఆర్.దుర్గాభవాని, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

